## కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో బండి ప్రకాశ్ మృతి?



బండి ప్రకాశ్(ఫైల్)

మందమర్రి, మే 8 : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం కర్రెగుట్టల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మందమర్రి పట్టణానికి చెందిన మావోయిస్టు కీలక నేత బండి ప్రకాశ్ మృతి చెందినట్లు పలు చానళ్లలో వార్త ప్రసారం కావడం చర్చనీయాంశంగా మారింది. మందమర్రి పట్టణానికి చెందిన ప్రకాశ్.. నాలుగు దశాబ్దాల క్రితం సింగరేణిలో జరిగిన అనేక పోరాటాల్లో కీలక పాత్ర పోషించాడు. ఏరియాలో బొగ్గు గని కార్మికుడిగా పని చేసిన రామారావు-అమృత దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు. రెండో సంతానమైన బండి ప్రకాశ్ మొదటి నుంచి ప్రజా ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించేవాడు. సికాస కార్యదర్శిగా, స్పెషల్ జోన్ కమిటీ నాయకుడిగా పని చేశారు. ప్రస్తుతం మావోయిస్టు స్పెషల్ జోన్ కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్న ఆయనపై పోలీస్ రివార్డు కూడా ఉంది. బండి ప్రకాశ్‌కు భార్య, కొడుకు ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో బండి ప్రకాశ్ మృతి చెందినట్లు పోలీసులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 8 : ప్రజలు, యువత.. గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబంలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసగా మారితే వారి వివరాలను 87126 70551 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

లింగాపూర్, మే 8 : లింగాపూర్ మండలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పిట్టగూడకు చెందిన మర్సుకోల ప్రకాశ్ (36) బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడగా, గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశ్ బుధవారం రాత్రి జైనూర్ నుంచి పిట్టగూడకు బైక్‌పై వస్తుండగా, రావునూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలవగా, ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. గాంధీ దవాఖానకు తీసుకెళ్లగా, గురువారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## కోమటిచేనులో ఒకరు మృతి

కాసిపేట, మే 8 : కాసిపపేట మండలం కోమటిచేను శివారులోని చేనులో జాడి శంకర్ (59) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జాడి శంకర్‌కు ఏడాది నుంచి ఫిట్స్ వస్తుండగా, చికిత్స చేయిసుతన్నా తగ్గలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కోమటిచేను శివారులోని చేనుకు పని నిమిత్తం వెల్లాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో కొడుకు జాడి సత్యనారాయణ చేను వద్దకు వెళ్లాడు. రాత్రి చేనులో కిందపడి, చనిపోయి కనిపించాడు. శంకర్ అనారోగ్యంతో గానీ, వడ దెబ్బతో గానీ మృతిచెంది ఉంటాడని కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పల్లె దవాఖాన ప్రారంభం

జన్నారం, మే 9 : కలమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. అనంతరం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, డాక్టర్ ఉమశ్రీ, గంగాదేవి, వైద్య సిబ్బంది, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసియుల్లా, ముత్యం సతీశ్, దుమల్ల రమేశ్, ఇందయ్య, నర్సింగరావు, గంగన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు

రెబ్బెన, మే 8 : సింగరేణి ఉద్యోగులకు సంస్థ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నదని బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి, ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఏరియా దవాఖానల్లో వారంలో కొన్ని రోజులు ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా బెల్లంపల్లి ఏరియా దవాఖానలో ప్రతీ శుక్రవారం జనరల్ మెడిసిన్, ఆర్థోసర్జన్, సైకియాట్రిస్ట్, ప్రతీ మంగళవారం జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్‌లు అందుబాటులో ఉంటారని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## డైరెక్టర్‌గా యాదగిరి

మంచిర్యాల (ఏసీసీ), మే 8 : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషరీస్ కో ఆపరేటివ్ లిమిటెడ్ డైరెక్టర్‌గా మంచిర్యాల జిల్లాకు చెందిన బోరే యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఫెడరేషన్ నిర్వాహకుల నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ పదవిలో ఐదేళ్ల పాటు యాదగిరి కొనసాగుతారు. ఎంపికైనందుకు నెన్నెల జట్పీటీసీ సాలిగాం బానయ్య, నర్సయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

## సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రి రూరల్, మే 8 : ఆపదలో ఉన్న మహిళలు, యువతులు సఖీ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీలత, సైకో సోషల్ కౌన్సిలర్ జ్యోతి, కేస్ వర్కర్ లావణ్య సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. సఖి కేంద్రం మహిళల కోసం 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో రజియా సుల్తానా, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సఖి కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీలు

కన్నెపల్లి, మే 8 : వెంకటాపూర్‌లో నకిలీ విత్తనాలున్నాయనే సమాచారం మేరకు గుర్రాల సత్యనారాయణ, ఆవుల చందు ఇండ్లలో గురువారం పోలీసులు తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు వాడవద్దని, నిల్వ, రవాణా చేయవద్దని సూచించారు. నకిలీ విత్తనాలున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు.

## విలీన సభ విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, మే 8 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ నెల 11న జరిగే రెండు కాంట్రాక్టు కార్మిక సంఘాల విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం కోరారు. శ్రీరాంపూర్‌లో గురువారం కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో మాట్లాడారు. 2013లో అనివార్య కారణాలవల్ల విడిపోయిన కార్మిక సంఘాలు ఒక్కటవుతున్నాయని తెలిపారు. యాదగిరి, శంకర్, సుధాకర్, రాంబాబు, సురేశ్, నగేశ్, విజేందర్, రాకేశ్, సమ్మయ్య, శారద, మల్లేశ్వరి, శిరీష, కవిత తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు

# స్వయం ఉపాధిపై మహిళల ఆసక్తి

- కుటుంబాలకు బాసటగా నిలుస్తున్న యువతులు
- ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు
- తోడ్పాటునందిస్తున్న సింగరేణి సేవా సమితి

మందమర్రి, ఏప్రిల్ 23 : సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి పట్టణంతో పాటు, పరిసర గ్రామాల మహిళలు స్వయం ఉపాధిపై ఆసక్తి చూపుతున్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులకు తమ వంతు సహకారం అందించేందుకు వారితోపాటు, యువతులూ ముందుకువస్తున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. చదివిన చదువుతోనే స్వయం ఉపాధి పొందాలని భావిస్తుండగా, వీరి ఆలోచనలకు సింగరేణి యాజమాన్యం బాసటగా నిలిచింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి యాజమాన్యం స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభించింది. సింగరేణి పరిసరాల నిరుద్యోగ యువకులకు సైతం స్వయం ఉపాధి కల్పించేందుకు కంప్యూటర్‌తో పాటు, వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నది. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో పలు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. మహిళలు, యువతులకు కుట్లు, అల్లికలు, మగ్గం వర్క్, టైలరింగ్, కంప్యూటర్ తదితరాల్లో శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షకులను నియమించారు. ప్రతీ మూడు, ఆరు నెలల కాల వ్యవధిలో బృందాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. అనంతరం మహిళలు, యువతులు ఇండ్లలోనే స్వయం ఉపాధి పనులు చేస్తుండగా, మరికొందరు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇతరులకూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. బొగ్గు ఉత్పత్తి పైనే కాకుండా సింగరేణి ప్రాంతంపై ఆధారపడి జీవిస్తున్న వారికి సైతం స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్న సింగరేణి యాజమాన్య సేవలను పలువురు అభినందిస్తున్నారు.

# విద్యాశాఖ కార్యక్రమాలు వినియోగించుకోవాలి

నస్పూర్, మే 8 : విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రతీ విద్యార్థి వినియోగించుకునేలా ప్రణాళికలతో పనిచేయాలని మంచిరాయల డీఈవో యాదయ్య పేర్కొన్నారు. మంచిర్యాలలోని జిల్లా సైన్స్ కేంద్రంలో గురువారం ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఆయన అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి గుణాత్మక, డిజిటల్ విద్య అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు చౌదరి, యశోదర, శ్రీనివాస్, సత్యానారాయణమూర్తి, డీసీఈబీ సెక్రటరీ మహేశ్వర్ రెడ్డి, ఏఎస్పీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



చెన్నూర్ రూరల్ : విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

**వేసవి శిబిరం పరిశీలన..**

చెన్నూర్ రూరల్, మే 8 : చెన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిబిరాన్ని డీఈవో పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యత పరిశీలించారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిబిరంలో ఆటలు ఆడించడం, పాటలు పాడిపించడం, రాయడం, చదవడం నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణ మూర్తి, చౌదరి పాల్గొన్నారు.

**దరఖాస్తుల స్వీకరణ..**

నస్పూర్, మే 8 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో 2025-27 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ 2025 దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేరొకన్నారు. ఇంటర్ గానీ, తత్సమాన పరీక్షలో గానీ 50 శాతం మార్కులు వచ్చిన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. డీసెట్ రాత పరీక్ష ఈ నెల 25న ఉంటుందని వివరించారు.

## హ్యాండ్ బాల్ జట్టు కోచ్‌గా సాయికుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 8 : తమిళనాడు రాష్ట్రం తిరువన్నమలై పట్టణంలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగే హెచ్‌ఎఫ్ఐ 40వ సౌత్ జోన్ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు కోచ్‌గా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గోగర్ల సాయి ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోనే శ్యాంసుందర్ రావు, కనపర్తి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయికుమార్ జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి విద్యా మందిర్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు అరిగెల మల్లికార్జున్, జిల్లా యువజన క్రీడల అధికారి రమాదేవి, క్రీడల అధికారి బండ మీనా రెడ్డి, కోచ్‌లు అరవింద్, రాకేశ్, రవి, తిరుపతి, సాగర్, యాదగిరి అభినందించారు.

**జాతీయస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థి..**

ఈ పోటీలకు జైనూర్ మండలం మార్లవాయికి చెందిన ఆత్రం ధనలక్ష్మి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు అరిగెల మల్లికార్జున్, జిల్లా యువజన క్రీడల అధికారి రమాదేవి, క్రీడల అధికారి బండ మీనా రెడ్డి సన్మానించారు. కోచ్‌లు అరవింద్, రాకేశ్, సాయి పాల్గొన్నారు.

**న్యాయనిర్ణేతగా కల్యాణ్**

నస్పూర్, మే 8 : 40వ సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు రెఫరీగా తెలంగాణ రాష్ట్రం నుంచి మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలానికి చెందిన జుమిడి కల్యాణ్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణ్‌ను గురువారం శ్యాంసుందర్‌రావు, రమేశ్, రమేశ్‌రెడ్డి, కోచ్‌లు రాజలింగు, అరవింద్, రాకేశ్, రాజశేఖర్, సాయి, కార్తిక్ అభినందించారు.

## క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించాలి

సీసీసీ నస్పూర్, మే 8 : కేజీబీవీల్లో చదువుకునే విద్యార్థినులు క్రమశిక్షణతో కూడిన ఉన్నత విద్యనభ్యసించాలని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ, ఫైనాస్ లీటరసీ లిప్సిక సూచించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ కేజీబీవీలో పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల దశ నుంచే చదువుల్లో రాణిస్తే భవిష్యత్‌లో మంచి స్థానంలో ఉంటారని, అందుకు అనుగుణంగా కష్టపడి చదువుకోవాలన్నారు. విద్యార్థినులకు బేటీ బచావో- బేటీ పడావో, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైం, మహిళా హెల్‌లైన్-1930, సఖీ సర్వీస్ హెల్ప్‌లైన్-181పై అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్, మే 8 : దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు, కార్మిక కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరి యా జీఎం ఎం శ్రీనివాస్ సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులు, గనులు, ఓసీపీల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై గురువారం జీఎం ఆఫీస్‌లో ఏరియా అధికారులతో సమీ క్షా సమావేశం నిర్వహించారు. ఏజీఎం భీభత్స, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, పీవోలు ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీవైజీఎం అరవిందరావు, ఆనంద్‌కుమార్, ఎస్ఈ చంద్రశేఖర్, ఎంవీటీసీ మేనేజర్ రామారావు పాల్గొన్నారు.

## ప్రత్యేకాధికారి బాధ్యతలు

చెన్నూర్ టౌన్, మే 8 : చెన్నూర్ మండల ప్రత్యేకాధికారిగా మంచిర్యాల డీపీవో డీ వెంకటేశ్వర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలు విషయాలపై పలువురు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంపీడీవో ఎం మోహన్, మండల పంచాయతీ అధికారి ఎండీ అజ్మత్ అలీ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హద్దులు దాటి వైద్యం చేస్తే చర్యలు

కెరమెరి, మే 8 : ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, హద్దులు దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మధూకర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆర్ఎంపీలతో సమావేశమై, అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఏదైనా సమస్యతో వస్తే వారికి సరైన సూచనలు చేయాలి తప్ప, తెలిసీ తెలియని వైద్య ప్రయోగాలు చేయవద్దని సూచించారు. కొందరు దవాఖానలు ఏర్పాటు చేసి, వైద్యం చేస్తున్నట్లు సమాచారమున్నదని తెలిపారు. అలాగే మురికిలొంక గ్రామాన్ని సందర్శించి, యువకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారికి వాలీబాల్ కిట్, టీ షర్టులు అందించారు.

## టాస్క్ ద్వారా ఉచిత శిక్షణ

నస్పూర్, మే 8 : టాస్క్ ద్వారా ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం టాస్క్ శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టాస్క్ అధికారి సాయికుమార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. 30 రోజుల పాటు యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలు అందించి, వారి ఉపాధి అవకాశాలు పెంపొందించడం జరుగుతుందన్నారు. మొదటి విడుతలో ఎంపికైన 40 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాజీవ్ యువ వికాసం పథకంపై తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఈ పథకం చేపట్టిందన్నారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు ఆర్థిక రుణ సదుపాయం కల్పించి, ఉపాధి పొందేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అలాగే మంచిర్యాలను పూర్తి అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. పదోతరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని, మున్ముందు ఉత్తమ ఫలితలు సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. రెవెన్యూ ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, అధికారులు దుర్గా ప్రసాద్, రవీందర్ రెడ్డి, రాజేశ్వరి, పురుషోత్తం, జనార్దన్ పాల్గొన్నారు.

## ఉపాధి పనుల తనిఖీ

జన్నారం, మే 8 : డివిజన్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్ అడవుల్లో ఇటీవల చేపట్టిన ఉపాధి హామీ పనులను రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ తనిఖీ చేశారు. పనులు చేసిన ప్రాంతంలో కొలతలు చేపట్టి, పనులను సక్రమంగా నిర్వహించారని తెలుసుకున్నారు. పనికి తగిన ఫలితం కూలీలకు అందించనున్నట్లు తెలిపారు.

కాగజ్‌నగర్, మే 8 : కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామ శివారులోని ఫారం పాండ్ ఉపాధి పనులను ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. కూలీలతో పని ప్రదేశాల్లో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా పనులు కల్పించాలన్నారు. అనంతరం చింతగూడ నర్సరీని సందర్శించారు. ఏపీవో చంద్రశేఖర్, కార్యదర్శి హరీశ్, ఉపాధి కూలీలు ఉన్నారు.

కౌటాల, మే 8 : మండలంలోని నాగెపల్లి, కౌటాలలో ఉపాధి పనులను ఎంపీడీవో బుద్దే రమేశ్ పరిశీలించారు. ఫాం పండ్ పనులు పరిశీలించి, కూలీలకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీపవో కార్యాలయంలో జరుగుతున్న రాజీవ్ యువ వికాస్ అభ్యర్థుల ఇంటర్వ్యూను పరిశీలించారు. ఏపీవో పూర్ణిమ, ఈసీ సంతోష్, కార్యదర్శులున్నారు.

## అక్షరాస్యతపై అవగాహన

కౌటాల, మే 8 : మండలంలోని నాగెపల్లి గ్రామ పంచాయతి పరిధి గిన్నెలేటి గ్రామంలో ప్రజలకు అక్షరాస్యతపై మోటివేషన్ స్పీకర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ అవగాహన కల్పించారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ చదువు నేర్చుకోవాలని సూచించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మూఢ నమ్మకాలను విడనాడి ఆధునిక వైద్యం వైపు మారాలని, బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాల గురించి అర్థమయ్యేలా వివరించారు. కార్యదర్శి సంధ్యా రాణి, మాజీ సర్పంచ్ నిహారిక, ఫీల్డ్ అసిస్టెంట్ సోమయ్య, గ్రామ పెద్దలు దివాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

బెల్లంపల్లి, మే 8 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి

రెబ్బెన, మే 8 : దేశ వ్యాప్తంగా 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. రెబ్బెన మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం డాక్టర్ సుజిత్‌కు సమ్మె నోటీస్ అందించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఎన్‌హెచ్‌ఎం జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రమీల, సిబ్బంది తులసి, వనిత, మండల్, ఏఐటీయూసీ నాయకుడు అరికల్ల స్వామి తదితరులు ఉన్నారు.

## తలసేమియాపై అవగాహన ఉండాలి

మంచిర్యాల అర్బన్, మే 8 : తలసేమియా వ్యాధిపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీశ్ రాజ్ అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో తలసేమియా అవగాహనా ర్యాలీ తీశారు. డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. 'తలసేమియా గూరించి తెలుసుకుందాం.. రక్త దానంతో ప్రాణాలు రక్షించుదాం.., వివాహానికి ముందు రక్త పరీక్ష తప్పనిసరి' వంటి నినాదాలతో ర్యాలీని కొనసాగించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. తలసేమియా జన్యుపరమైన వ్యాధి అని, తల్లిదండ్రుల్లో ఇద్దరిలోనూ లక్షణాలు ఉంటే, పుట్టే పిల్లలకూ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి డివిజన్ల జిల్లా ఉప వైద్యాధికారులు అనిత, సుధాకర్ నాయక్, ప్రోగ్రాం అధికారి అనిల్, జీజీహెచ్ ఆర్ఎం వో శ్రీధర్, వైద్యాధికారులు శివప్రతాప్, స్నేహిత, అశోక్, అమన్, రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహేందర్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలి

బెల్లంపల్లి, మే 8 : గ్రామ సభల ద్వారానే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం సమర్పించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రకియను ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అప్పగించడంతో వారికి అనుకూలమైన వారికి ఇండ్లను మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత లోపించిందని, అర్హులకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు రామగౌని అశోక్‌గౌడ్, పెట్టెం సత్తయ్య, గోమాస వినోద్, దుర్గం హరికృష్ణ, పంజాల శ్రీనివాస్ గౌడ్, దుర్గం ప్రసాద్, పాగిడి మోహన్, దుర్గం జయకృష్ణ, గౌమాస సూర్య, ఆకుదారి రాజేశ్వరి, సల్లూరి మోహన్, సల్లూరి శ్రీనివాస్‌లు ఉన్నారు.

## సివిల్ సర్వీసెస్ కోచింగ్‌కు దరఖాస్తులు

మంచిర్యాల (ఏసీసీ), మే 8 : సివిల్ సర్వీసెస్ పరీక్ష కోసం ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వంద మంది మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంచిర్యాల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి గురువారం తెలిపారు. మహిళా అభ్యర్థులు, దివ్యాంగులకు రిజర్వేషన్‌లో సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. డిజిటలైజ్డ్ తరగతి గది, ఢిల్లీ, దేశంలోని ఇతర ప్రముఖ ప్రాంతాల నుంచి బోధన సిబ్బంది, ల్యాబ్, లైబ్రరీ, ఇంటర్‌నెట్, వైఫై, వెబ్‌సైట్, నాణ్యమైన వసతి సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. ఎంపిక మెరిట్ ప్రతిపాదికన ఉంటుందని, 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 5న స్క్రీనింగ్ టెస్టు ఉంటుందని, అర్హత గల అధికారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్, 040-23236112 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిశీలన

పెంచికల్‌పేట్, మే 8 : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ అన్నారు. జిల్లాలో పైలెట్ మండలంగా ఎంపికైన పెంచికల్‌పేట మండలం పోతపల్లి కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సును గురువారం ఆయన సందర్శించారు. దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలు ఉన్న రైతులు నిర్ణీత నమూనాలు దరఖాస్తులను సమర్పించాలని, ఈ దరఖాస్తుల వివరాలను నమోదు చేసుకొని తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ కవిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాసిపేట, మే 8 : కాసిపేట మండలం మల్కెపల్లిలో బెల్లంపల్లి రైతుల ఉత్పత్తిదారుల కంపెనీ(ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేందాన్ని గురువారం డీడీఎం అబ్దుల్ రవూఫ్, తహసీల్దార్ బోజన్న ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు మంచి ధర పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఎఫ్‌పీవో చైర్మన్ ఎంబడి కిషన్, డైరెక్టర్లు కళావతి, ముత్తె బానయ్య, మల్లేశ్, జనార్దన్, బక్కన్న, మాజీ ఎంపీపీ సిడాం జంగు, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, సీఈవో కుమార్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బీఆర్‌ఎస్ నాయకుల సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎలుక రాంచందర్

తాండూర్, మే 8 : పదోతరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన ఆయా పాఠశాలల విద్యార్థులను బీఆర్‌ఎస్ నాయకులు ఎలుక రాంచందర్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. తాండూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల టాపర్ ఎంఏ సాఖీబ్ (523), విద్యాభారతి హైస్కూల్ విద్యార్థి రియాన్‌ఖాన్ (520)కి నగదు అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తాత్రేయరావు, అబూసాద్, పేర్క రాజన్న, దుర్గం శ్రీనివాస్, ఇక్బాల్ హుస్సేన్, ఉప్పుట్ల సంతోష్, సిరాజుద్దీన్, కొల్లూరి తిరుపతి, గౌస్, అజ్జు, అత్తర్ హుస్సేన్, రిజ్వాన్, విద్యార్థుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

నస్పూర్, మే 8 : సెటిల్‌మెంట్, భూ రికార్డుల కమిషన్ డైరెక్టర్ ఆఫ్ సర్వే ఆదేశాల ప్రకారం లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మీ సేవ కేంద్రాల ద్వారా ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో 50 రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటర్ గణితంలో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ, బీటెక్ సమాన అర్హత గల వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96769 93237, 98481 63493 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

**ఇంటర్ అడ్మిషన్లకు..**

కాసిపేట, మే 8 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, ఎంఈసీ ఒక్కో గ్రూపులో 40 చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. మే 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, మే 8 : పట్టణంలోని పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమలాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో న్యూ 5 ఎంవీఏ ఏరెక్షన్ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాలాజీనగర్, నౌగాంబస్తీ, మార్కెట్ ఏరియా, కౌసర్ నగర్ మసీద్ ఏరియాలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT : GODAVARIKHANI
E.A. No. 194 of 2025
in
E.P. No. 133 of 2024
in
ARB No. 155 of 2016
Between:
M/s. Margadarsi Chit Fund Pvt.Ltd., Ramagundam Branch. ...Award Holder
AND
Mr. E. Janardhan & Others ...Jdrs
NOTICE
To
Jdr No. 5 GANDI SATHISH, S/o. VENKATY, R/o. Qr.No. SD-487, Ramakrishnapur, Mdl: Mandamarri, Mancherial Dist.,
Take notice that the above E.P. is filed against you and others for recovery of money. Several times notices were issued to you, but you have failed to receive the same. The above E.P. is posted on 20.06.2025 for your appearance. On that day you have to appear in person or through an advocate at 10.30 a.m., before the court referred above. Otherwise the case will be decided ex-parte.
(BY ORDER OF THE COURT)
Sd/- S. Sanjay Kumar, Advocate for Award-Holder Godavarikhani.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
By This deed I, The Under Signed SHAIK ABDUL RAFIQ S/o SHAIK ABDUL HAMEED R/o, 3-82,Taroda (Vill) R/M: Mudhole. Dist Nirmal and Telangana State. I Changed My name from SHAIKH ABDUL RAFIQ ABDUL HAMEED to SHAIK ABDUL RAFIQ S/o SHAIK ABDUL HAMEED For all future purpose

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677